క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు మెరుగైన వైద్యసేవలు



నగరంపాలెం: గాయపడిన కానిస్టేబుల్ రమేష్‌బాబు ఆరోగ్య పరిస్థితిపై గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆరా తీశారు. అనంతరం కానిస్టేబుల్ తండ్రి బసవయ్యతో మాట్లాడారు. తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో శనివారం దుండగులను పట్టుకునే ప్రయత్నంలో అత్యంత ధైర్యసాహసాల్ని ప్రదర్శించి, ఈ క్రమంలో గాయాలై గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్‌బాబు చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఆసుపత్రికి చేరుకుని, కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. బాధితునికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

ఖైదీలకు కంటి వైద్య పరీక్షలు



గుంటూరు లీగల్: డాక్టర్ వైఎస్సార్ అవ్వా–తాత కంటి వెలుగు పథకం మూడో దశలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్య బృందం సోమవారం గుంటూరు జిల్లా జైలులో 60 ఏళ్ల దాటిన ఖైదీలకు కంటి పరీక్షలు నిర్వహించింది. అంధత్వ నివారణ మార్గాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలర్ బి.తేజేశ్వరరావు, కారాగార వైద్యాధికారి కె.లక్ష్మీ పూర్ణలత, డెప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, బి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, టి.భాస్కర్, పీఎంవోవోలు పాల్గొన్నారు.

జావలిన్ త్రో చాంపియన్‌షిప్‌లో నాగార్జునకు ద్వితీయ స్థానం



గుంటూరు ఎడ్యుకేషన్: బీఆర్ స్టేడియంలో సోమవారం జరిగిన నీరజ్‌చోప్రా గుంటూరు జిల్లా జావలిన్ త్రో చాంపియన్‌షిప్‌లో హిందూ ఇంజినీరింగ్ కళాశాలలోని పాలిటెక్నిక్ ఈఈఈ విద్యార్థి ఎం. నాగార్జున ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి నాగార్జునను కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ చిన్నం సుబ్బారావు, వ్యాయామ అధ్యాపకుడు రవి అభినందించారు.

చేనేత దినోత్సవంపై పోటీలకు స్పందన

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్ని నిర్వహించారు. సెలెబ్రేటింగ్ ఇండియన్ హ్యాండ్లూమ్స్: వీవింగ్ అవర్ కల్చరల్ హెరిటేజ్‌అనే అంశంపై గుంటూరు నగరంతోపాటు అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు జరిపారు. నేతన్నల శ్రమ, చేనేత వృత్తికి గల గౌరవాన్ని ఇనుమడింపచేసేలా జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పర్యవేక్షణలో డీవైఈవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, కార్పొరేటర్లు శంకుస్థాపన చేశారు. 15వ వార్డులో రూ.20లక్షలతో మంచినీటి పైపులైన్ పనులకు, 57వ డివిజన్ గడ్డిపాడు చెరువు వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో తూర్పు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌కుమార్, 57వ డివిజన్ కార్పొరేటర్ రిహానా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

V. INDIRA PRIYA NAGA DARSINI, Advocate, J.K.C College Road, Guntur City & Dt. Cell:[illegible]

పసిమొగ్గల ప్రాణాలతో చెలగాటం

- పరిమితికి మించి ప్రయాణం
- స్కూలు ఆటోల్లో ఇబ్బడిముబ్బడి తరలింపు
- చోద్యం చూస్తున్న ఆర్టీవో, ట్రాఫిక్ శాఖ అధికారులు
- కనీస తనిఖీలు కరువు



పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించిన ఆటో

పట్నంబజారు: వేమవరం వద్ద తెల్లవారుజామున జరిగిన ఆటో ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు మృతి చెందిన దుర్ఘటన ఇప్పటికీ కళ్ల ముందు కదులుతూనే ఉంది. తల్లిదండ్రుల గుండెల్లో గుబులు రేపుతూనే ఉంది. నిబంధనలకు పాతరేసి ఇష్టానుసారంగా పసిమొగ్గల్ని ఆటోల్లో ఇబ్బడిముబ్బడిగా కళ్ల ముందే తరలిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారులు చోద్యం చూస్తున్నారు.

నిబంధనలకు పాతర

జిల్లాలో 28,395 ఆటోలు ఉండగా, గుంటూరు నగరంలో 15వేలకు పైగా (ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న సైతం) తిరుగుతున్నాయి. వీటిలో 2500 నుంచి 3000 వరకు ఆటోలు విద్యార్థుల్ని పాఠశాలలు, కళాశాలలకు చేరవేస్తున్నాయి. పనుల నిమిత్తమో, బస్సుల ఫీజులు కట్టలేకో, పలు కారణాలతో తల్లిదండ్రులు ఆటోల్ని ఆశ్రయిస్తున్నారు. ఆటో సామర్థ్యాన్ని బట్టి విద్యార్థుల్ని ఎక్కించాల్సిన డ్రైవర్లు మాత్రం పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. బజాజ్ డీజిల్ ఆటోలో (కేవలం వెనుక భాగంలోనే) నలుగురు నుంచి ఐదుగురిని ఎక్కించాల్సిన డ్రైవర్లు 10 మంది వరకు ముందూ, వెనుక భాగాల్లో కూర్చొపెట్టి మరీ ప్రయాణం చేస్తున్నారు. నెలకు ఐదో తరగతి లోపు రూ.1500, 10వ తరగతి వరకు రూ.2500, కళాశాల విద్యార్థులకు రూ. 3వేలకు పైగా వసూలు చేస్తున్నారు.

పాఠశాల బస్సుల పైనే రవాణా శాఖ దృష్టి

ఆటోవాలాలు వ్యవహరిస్తున్న తీరు భయాందోళన పుట్టించే విధంగా ఉంటోంది. కేవలం పాఠశాలల బస్సుల పైనే దృష్టి సారించిన ఆర్టీవో అధికారులు, కనీసం ఆటోలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిత్యం నగరంలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆటోలో ముందు వైపు పెద్దలనే ఎక్కించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ.. చిన్నారుల్ని సైతం ముందు, ఆటో వెనుక భాగాల్లో కూర్చొపెట్టి ప్రయాణం చేయడంతో ప్రమాదకరంగా మారుతోంది. ఏదైనా ఘటన జరిగితే తప్పా అధికారులు స్పందించరా? అనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.



విద్యార్థులను ఆటో వెనుక భాగంలో కూర్చొపెట్టి ..

తనిఖీలు చేపడతాం



విద్యార్థుల్ని స్కూలు, కళాశాలలకు తీసుకుని వెళ్లే సమయంలో అధికంగా ఎక్కించకూడదని ఇప్పటికే సమావేశం పెట్టి ఆటో యాజమాన్యాలకు సూచించాం. అధిక లోడుతో ప్రయాణం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తాం. తల్లితండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా సహకరించాలి.

– షేక్ కరీం (డీటీసీ, గుంటూరు జిల్లా)

ఫోర్టిఫైడ్ బియ్యం బలవర్ధకం

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి
- ఫోర్టిఫైడ్ బియ్యంతో పిండివంటల తయారీ పోటీలు



వంటల పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం రూపాయికే అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంతో బలవర్ధకమైన పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిర ఆవరణలో జిల్లా పౌరసరఫరాల శాఖ, ఐసీడీఎస్ సంయుక్తాధ్వర్యంలో బలవర్ధకమైన ఆహారం తయారు చేసే విధానంలో పోటీలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారి ఆహార భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అవరోధాలను దాటుకుని ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తుందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా వీటిని ఇంటివద్దకే అందిస్తున్నాయన్నారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ ఇది కేవలం అన్నం వండుకోవడానికే కాకుండా చిన్నారులు తినేందుకు కావాల్సిన పిండివంటల్లోనూ వాడుకోవచ్చన్నారు. చిరుతిళ్లు కూడా తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్ బీ12, ఫోలిక్ యాసిడ్‌లాంటి గుళికలను బియ్యంలో కలిపి ఇస్తారని చెప్పారు. ముఖ్యంగా ఈ బియ్యం ఎంతో విలువైనవని, వీటిని అక్రమార్కులకు విక్రయించవద్దని జేసీ తెలిపారు. ఈ శిబిరంలో ఫోర్టిఫైడ్ బియ్యంతో చేసిన పిండి వంటలు చలివిడి, అరిసెలు, కొబ్బరి బూరెలు, మురుకులు, దోశలు, క్యారెట్ ఇడ్లీ తదితర ఆహార పదార్థాలను కలెక్టర్, జేసీ, అధికారులు రుచి చూశారు. షేక్ హసీనా, సీహెచ్ లక్ష్మీరాజ్యం, ఎం.సత్యవతిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కలెక్టర్, జేసీలు అందజేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కోమలి పద్మ, ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని, సివిల్ సప్లయిస్ డీఎం జి.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత పారదర్శకంగా ఎస్‌ఎస్‌ఆర్–2024 ఓటర్ లిస్టు తయారీ

గుంటూరు వెస్ట్: రానున్న ఎన్నికలకు పటిష్ట విధానాలతో, అత్యంత పారదర్శకంగా ఎస్‌ఎస్‌ఆర్–2024 ఓటర్ లిస్టు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ప్రతి రోజూ బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారన్నారు. దీనిలో ప్రజాప్రతినిధులు, బూత్ ఏజెంట్లు పాల్గొని సక్రమమైన ఓటర్ల లిస్టులు తయారు చేసే విధంగా కృషి చేయాలని సూచించారు.

రైతులకు మంచి ధర అందించడం యార్డు బాధ్యత

కొరిటిపాడు: మిర్చి యార్డులో సోమవారం యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డితో కలసి చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పర్యటించారు. కమీషన్ షాపుల్ని సందర్శించారు. మిర్చి రైతులు, షాపుల యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజనారాయణ మాట్లాడుతూ రైతులకు మంచి ధర లభించేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మిర్చి రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. రైతు విశ్రాంతి భవన్‌లో మెరుగైన వసతులు కల్పించాలని కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట యార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

కమిషనర్ రాహుల్ పాండేను కలసిన చైర్మన్

యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ సోమవారం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండేను మర్యాదపూర్వకంగా కలిశారు. పాత మార్కెట్ యార్డులో రూ.8 కోట్లతో చేపట్టిన కమర్షియల్ టాక్స్ కార్యాలయం బిల్డింగ్ నిర్మాణం మధ్యలో నిలిపి వేసినట్లు ఆయన దృష్టికి తెచ్చారు. దాన్ని పూర్తి చేయడానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

డీఎల్‌ఎస్‌ఏలో తల్లిపాలపై అవగాహన

గుంటూరు లీగల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ)లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ సంస్థతో కలసి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి జి.చంద్రమౌళీశ్వరి తల్లిపాల విశిష్టతను వివరించారు. జిల్లా వైద్యాధికారులు తల్లిపాలపై అవగాహన కలిగించారు. సదస్సులో కోర్టులో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు, అడ్వకేట్స్, పీడీ బి.మనోరంజని, సీడీపీవో టి.కృష్ణవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్వదేశీ ఉద్యమానికి నాంది పలికిన చేనేత



మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బత్తుల దేవానంద్, ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర సంగ్రామ సమయంలో విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా స్వదేశీ వస్త్రమైన చేనేత ముఖ్య పాత్ర పోషించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించడం, దేశ చరిత్రలో చేనేతకు గల ప్రాధాన్యతను గుర్తించడం సముచితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు కె. చిన్నపరెడ్డి, ఎస్. నాగిరెడ్డి, ఉద్యోగులు ఎం. సీతారామయ్య, వైసీపీ ఐటీ విభాగ అధ్యక్షుడు మాదాసు కిరణ్, నాయకులు భాగ్యారావు, బాబు, దుర్గా, ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా జేసీ లా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులతో వేమన కుప్పుస్వామి, సుధాకర్‌బాబు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాలలో సోమవారం మొదటి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లు, ఐదేళ్ల లా కోర్సుల్ని పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. సుధాకర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గద్దర్ జీవితం గొప్ప సందేశం

- యువతలో నిజమైన స్ఫూర్తి నింపిన ధీరుడు గద్దర్
- గద్దర్ సంతాప సభలో వీసీ ఆచార్య రాజశేఖర్



గద్దర్ మృతికి సంతాపం తెలుపుతున్న వీసీ రాజశేఖర్, రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: సమాజంలో అణగారిన వర్గాల నిజమైన అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేసిన గద్దర్ జీవితం సమాజానికి గొప్ప సందేశమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు సోమవారం కవి, కళాకారుడు గద్దర్ సంతాప సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ, యూనివర్సిటీ అధికారులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపంగా మౌనం పాటించారు. వీసీ ప్రసంగిస్తూ సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు ఏ మార్గాలలో కృషి చేయాలనే అంశాలపై యువతలో నిజమైన స్ఫూర్తిని నింపిన ధీరుడు గద్దర్ అన్నారు. ఆయన పోరాడే ఆశయాన్ని అంగీకరించని వర్గాలు కూడా ఆయన మేధస్సును, పోరాట స్ఫూర్తిని, కళాత్మక నైపుణ్యాన్ని ఎంతో అభిమానించారన్నారు. మన దేశంలో ప్రాంతాలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా కోట్లాది హృదయాలు గెలిచిన పోరాట యోధుడు గద్దర్ అన్నారు. అణగారిన వర్గాలు హక్కులు, ఆ వర్గాల విద్యార్థుల ప్రయోజనాల కోసం ఆయన వినూత్నమైన పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయాలపై ఏఎన్‌యూ వేదికగా విస్తృతమైన పరిశోధనలు జరగాలని అభిప్రాయపడ్డారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, యూనివర్సిటీ అధికారులు ఆచార్య స్వరూపరాణి, ఆచార్య గంగాధరరావు, ఆచార్య మధుబాబు, ఆచార్య సునీత, ఆచార్య ఉదయకుమార్; డాక్టర్ నాగరాజు ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఆచార్య సిద్దయ్య, ఆచార్య ప్రమీలారాణి పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఏర్పాటు శుభ పరిణామం

మంత్రి విడదల రజిని



జ్యోతి ప్రజ్వలన చేసి హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

గుంటూరు రూరల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయ ఆయుర్వేద వైద్యం ఎప్పటి నుంచో అమలులో ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. సోమవారం నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద నూతనంగా వంద పడకల శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ వెంకటేశ్వర్లు అధునాతన పద్ధతిలో వంద పడకల హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ల్యాబ్‌లు, చికిత్స కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా అధునాతన పద్ధతిలో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ (కేరళ పంచకర్మ స్పెషాలిటీ) ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కొట్టాకల్ ఆర్యవైద్యశాల కేరళ వారి అనుబంధ సంస్థ అని తెలిపారు. ఈ హాస్పిటల్ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఆయుర్వేద, కేరళ పంచకర్మ వైద్యం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, భాష్యం రామకృష్ణ, బొల్లేపల్లి సత్యనారాయణ, బి.రామారావు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం



సంకూరు శ్రీనివాసరావు



కాంట్రగుంట గురవయ్య



షేక్ మొహమూద్



శ్యామల వెంకటరమణాదేవి



మల్లిబోయిన శ్రీవల్లి



పాపతోటి అంబేడ్కర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఏడుగురు నామినేషన్ వేశారని, వారిలో 24 వార్డు కార్పొరేటర్ అడకా పద్మావతి విత్ డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్పొరేటర్ల సంఖ్యకు అనుగుణంగా స్టాండింగ్ కమిటీకి ఆరుగురు ఉండాలన్నారు. ప్రస్తుతం విత్ డ్రా తర్వాత ఆరుగురే ఉండటంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా శ్యామల వెంకట రమణాదేవి (26వ వార్డు), మల్లిబోయిన శ్రీవల్లి (52వ వార్డు), సంకూరి శ్రీనివాసరావు (13వ వార్డు), పాపతోటి అంబేడ్కర్ (55వ వార్డు), కంద్రగుంట గురవయ్య (21వ వార్డు), షేక్ మహమూద్ (4వ వార్డు) ఆగస్టు 6, 2024 వరకు ఒక సంవత్సరం కొనసాగుతారని కమిషనర్ తెలిపారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



ఫిర్యాదు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్పందనకు అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కారమయ్యేలా విభాగాధిపతులే నేరుగా పర్యవేక్షించాలని నగర అదనపు కమిషనర్ పెద్దిరోజా ఆదేశించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఆమె సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని చెప్పారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్ ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని సూచించారు. సచివాలయం పరిధిలో కూడా నిర్వహించే స్పందనలో కార్యదర్శులు కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 32 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి ఏడు, ఇంజినీరింగ్ విభాగానికి తొమ్మిది, రెవెన్యూ విభాగానికి ఏడు, ప్రజారోగ్య విభాగానికి ఏడు, పరిపాలన విభాగానికి ఒకటి, ఉపా సెల్ విభాగానికి ఒకటి ఉన్నట్లు వివరించారు. డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్‌ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

డాక్టర్ గురవారెడ్డికి జంధ్యాల పురస్కారం



డాక్టర్ గురవారెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ కమల తదితరులు

గుంటూరు మెడికల్: డాక్టర్స్ స్మైల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురవారెడ్డికి జంధ్యాల పురస్కారం ప్రదానం చేశారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో జంధ్యాల సతీమణి అన్నపూర్ణ మాట్లాడుతూ సమాజ సేవ చేస్తున్న డాక్టర్ గురవారెడ్డికి పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. పలువురు వైద్యులు సినీ గీతాలు ఆలపించారు. మెజీషియన్స్ ఇంద్రజాల ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాజ్యోతి, ఐఎంఏ నాయకులు డాక్టర్ నందకిశోర్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కళాధర్, డాక్టర్ రమణయశస్వి, డాక్టర్ ప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, జంధ్యాల అన్నపూర్ణ క్లబ్ నిర్వాహకులు, డయాబెటిక్ వైద్య నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్, డాక్టర్ కమల పాల్గొన్నారు. డాక్టర్ గురవారెడ్డికి హాస్యరస వైద్య సార్వభౌమ బిరుదు ప్రదానం చేశారు.

‘ఆడుదాం ఆంధ్ర’తో యువత ప్రతిభకు అవకాశం

నెహ్రూనగర్: క్రీడలపై ఆసక్తి కలిగిన యువతకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా మంచి అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని, దీన్ని నగర యువత సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా కోరారు. గుంటూరు నగరంలో కార్యక్రమ నిర్వహణపై అదనపు కమిషనర్ పెద్ది రోజా సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17ఏళ్ల పైబడి క్రీడలపై ఆసక్తి ఉండి, అవకాశం కోసం ఎదురు చూసే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ద్వారా మంచి అవకాశం కల్పిస్తోందని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వరకూ పోటీల్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా స్థాయిల్లో నగదు బహుమతులు కూడా అందించనున్నట్లు చెప్పారు. గుంటూరు నగర పరిధిలో సుమారు 3 లక్షల మంది క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. వార్డు సచివాలయాల్లో మంగళవారం నుండే అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో క్రీడలపై ఆసక్తి ఉన్నవారి వివరాలు తీసుకొని ఆన్‌లైన్ చేయాలని ఆమె ఆదేశించారు. ప్రతి క్రీడాకారునికి అకనాలేడ్జ్ కూడా ఇవ్వాలని సూచించారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు ఆడేందుకు అవకాశం లేదని, వారిని క్రీడల నిర్వహణ, సూచనలకు వినియోగించుకుంటామని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన వారికి రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు, జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు, రాష్ట్రస్థాయిలో విజేతలకు రూ.5 లక్షలు, ద్వితీయ స్థానం వారికి రూ.3 లక్షలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.2 లక్షలు నగదు బహుమతులు అందించనున్నట్లు ఆమె వెల్లడించారు. నగర యువత పెద్దఎత్తున క్రీడా పోటీల్లో పాల్గొని గుంటూరు నగరానికి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆమె కోరారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం జనసేన లక్ష్యం

పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యమిచ్చి సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా జనసేన పార్టీ ముందుకెళుతోందని రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని ఏ కన్వెన్షన్‌లో సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నవరత్నాల పేరుతో పథకాల్ని ప్రజలకు అందజేస్తున్నామని చెబుతున్న వైఎస్సార్ సీపీ, వివిధ వర్గాలకు సంబంధించిన ప్రత్యేక పథకాల నిధుల్ని బలవంతంగా దారి మళ్లిస్తోందని విమర్శించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, చేనేత వికాస విభాగ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు నాయబ్ కమల్ పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు వెస్ట్)

9912220356

Office mail : sakshigntadvt@gmail.com